క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ, మంచినీటి పైపులైన్ నిర్మాణం, పట్టణంలో బ్యూటీఫికేషన్, వీధిదీపాల కరెంటు చార్జీలు, మరమ్మతులు, బీటీ, గ్రావెల్, మెటల్ రోడ్ల హణ తదితర మొత్తం 57 అంశాలపై చర్చించడం జరుగుతుందని, కావున కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రామిరెడ్డిపేటలో చోరీ

నరసరావుపేట టౌన్: ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో నగదు, బంగారం ఆభరణాలు దోచు కెళ్లిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామిరెడ్డిపేట కృష్ణవేణి కళాశాల వీధిలో నివాసం ఉంటున్న బెల్లంకొండ సాయిరామ్ ఇంటికి తాళాలు వేసి రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న కుమార్తె వద్దకు ఆదివారం వెళ్లాడు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. బీరువా తెరిచి ఉండటాన్ని గమనించి పరిశీలించగా లాకర్‌లో ఉండాల్సిన బంగారం ఆభరణాలు, రూ.50 వేల రూపాయల నగదు కనిపించ లేదు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్‌ఐ సుమన్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటరులో నూరుశాతం ఫలితాల సాధించాలి

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2023-24 విద్య సంవత్సరం నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల్లో వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఫైనల్ పరీక్షలు రంగం సిద్ధం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ప్రీ ఫైనల్ పరీక్షలు ఫలితాల ఆధారంగా నూరుశాతం ఫలితాల సాధనకు విద్యార్థులను గ్రేడులు వారీగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహించి నూరుశాతం ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే విద్యార్థులకే హాల్ టిక్కెట్లు అందజేశామన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని, అలాగే ఉపాధ్యాయులు సూచనలు మేరకు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే అంశాలను జాగ్రత్తగా చదవి మంచి ఫలితాలు సాధించి నూతన జూనియర్ కళాశాలకు గ్రామానికి మండలానికి మంచి పేరు తేవాలన్నారు. జూనియర్ కళాశాల్లో మంచి బోధన కోసం ఏడు మంది ప్రత్యేక ఉపాధ్యాయులను ప్రభుత్వం ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టిందన్నారు. జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరాజు, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన సదస్సు

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఐసీడీయస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు లింగ వివక్షత, బాలల హక్కు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీయస్ సూపర్ వైజర్లు కె. శశిదేవి, డి. దేవీభాయి, ఎస్ కె.షమీమ్ సుల్తానా మాట్లాడుతూ సమాజంలో బాలబాలికలు అందరూ సమానులేనని అన్నారు. బాలికలు విద్యవల్ల అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. బాలికలకు చిన్నతనంలో వివాహాలు చేయటం వల్లన వారికి మానసిక, శారీరక ఎదుగుదల లేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరములు దాటిన తరువాత వివాహాలు చేయాలన్నారు. కిషోర బాలికలు రక్త హీనత నివారణకు తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించారు. అదే విధంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి, బంగారు తల్లి పథకం గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ నెం. 1098 గురించి అవగాహన కలిగించారు. గ్రామ సర్పంచ్ యు. సీతమ్మ, కె.జి.బి.వి. స్పెషల్ ఆఫీసర్ పి. బాలశౌరీలు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ వరికూటి ఓబుల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రింటర్‌ను బహుకరించారు. తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యం కోసం ప్రింటర్ బహుకరించటం ఆనందముగా ఉందని శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రింటర్‌ను బహుకరించిన శ్రీనివాసరెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.హనుమంతరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి

యడ్లపాడు: బీసీలంతా ఐక్యంగా ఉండాలని రాష్ట్ర అధికార ప్రతినిధి భానుగొన్నల శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడులో ఆదివారం రాత్రి బీసీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వ రరావు, నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కాకుమాను రమేష్, వెంకట్రావు, మహిళా అధ్యక్షురాలు కాసులమ్మ, నాదెండ్ల అధ్యక్షుడు కొనికి సాంబశివరావు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడిగా శివప్రసాద్ ఎంపిక చేసి నియామకం పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు వీరాంజనేయులు, పోతురాజు పేరిబాబు పుల్లయ్య మురళి వినోద్ సీతారామయ్య పాల్గొన్నారు.

దోచుకుంది.. దాచుకుంది.. వారే!!

- మాజీ ఎమ్మెల్యేలపై బొల్లా బ్రహ్మనాయుడు విమర్శ
- చేపల చెరువుల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకోవడం వాస్తవం కాదా?
- తాగునీటి చెరువుల్లో కూడా చేపల వ్యాపారం చేసిన ఘనత మీదే
- అసత్య ఆరోపణలు జనం నమ్మరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు ఇద్దరూ తోడు దొంగలుగా మారి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న వారేనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ఉంటూ అవినీతికి ఆస్కారం లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మక్కెన టీడీపీలో చేరారన్నారు. గతంలో నియోజకవర్గంలోని చేపల చెరువులన్నీ తన ఆధీనంలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడే చెరువుల్లో కూడా చేపలను పెంచి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్న విషయం ప్రజలందరికి తెలుసన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేపల వ్యాపారం యథేచ్ఛగా చేశారని, తోడు దొంగలు అనడానికి ఇదే నిదర్శమన్నారు. 750 ఎకరాల విస్తీర్ణం ఉన్న నడిగడ్డ చెరువును 10 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే కోర్టుల్లో కేసులు వేయించి ఆ పథకం అమలు కాకుండా మాజీ ఎమ్మెల్యే మక్కెన కుట్రపూరితంగా చేపలు పెంచుకున్నారని ఆరోపించారు. అలాగే కొండ్రముట్లపాలెం, పెదకంచర్ల, ముక్కెళ్లపాడు, చెరువుల్లో కూడా తనదైన శైలిలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని చెప్పారు. ఒక్క పెదకంచర్ల చెరువు 20 ఏళ్లు తన ఆధీనంలో ఉంచుకొని ఏడాదికి రూ.2 కోట్లు సంపాదించుకున్నాడన్నారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలకు నీరు లేకపోయినప్పటికీ పెదకంచర్ల చెరువు నుంచి ప్రైవేటు చేపల చెరువులకు నీరు తరలించడం ఎంతవరకు సబబన్నారు. మళ్లీ టీడీపీని గెలిపిస్తే వీధికొక బినామీ ఎమ్మెల్యేగా మారి ప్రజాధనాన్ని దోచుకుంటారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గుండ్లకమ్మ ప్రాజెక్టు కట్టలేదని, వరికపూడిశెల పూర్తికాలేదని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణానికి గత టీడీపీ హయాంలో తంగిరాల వద్ద శ్రీనివాస హేచరీస్ కంపెనీకి నీటి కేటాయింపులు చేశారని, దీంతో గుండ్లకమ్మ తంగిరాళ్ల డ్యాం నిర్మాణానికి అనుమతులు రాలేదని, పరోక్షంగా ప్రాజెక్టును అడ్డుకున్నది మీరే అన్నారు. నకిలీ బయో ఎరువులు, మొక్కల పేరుతో రైతులను మోసం చేసిన ఘనత జీవీకే దక్కుతుందన్నారు.

ప్రమాణానికి సిద్ధమా?

తాను రైతును చెప్పుతో కొడతానని అనకపోతే ప్రమాణానికి సిద్ధమా అని వ్యక్తిగత విమర్శలు చేసిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మాటలకు ఎమ్మెల్యే బొల్లా కౌంటర్ ఇచ్చారు. తమ స్వగ్రామానికి మక్కెన అనుచరుడైన ఓ వ్యక్తి రెచ్చగొట్టే విధంగా మాట్లాడి ఇక్కడ నాయకులే లేరని అన్న సందర్భంగా తాను చెప్పుతో కొడతానన్న మాట వాస్తవమేనని, కానీ అతను రైతు కాదని, వాహనాల బ్రోకర్ అని అన్నారు. అలాగే ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు దగ్గర డబ్బులు తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే మక్కెన ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన తమ పార్టీని వీడి టీడీపీలోకి వెళ్లినందుకు ఆనంద పడుతున్నామని, మరో మాజీ జీవీ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలంతా గమనిస్తున్నారని, ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న పోరాటంలో ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రజాధనం లూటీ కాకుండా గ్రామాల అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నామని, అది నచ్చని వారు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, మట్టి రాజయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బోయపాలెంలో గోవింద నామస్మరణ

- వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి గుడి ప్రతిష్టా మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తులు



కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. సుదీర్ఘ కాలంగా ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా చిలకలూరిపేట వెళ్లే హైవే పక్కన గ్రామస్తులు సమిష్టిగా దాతల సహకారంతో సుమారు రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి గుడిని నిర్మించుకున్నారు. రెండు నెలల కాలంలోనే పూర్తిస్థాయి నిర్మాణ పనుల్ని పూర్తి చేసుకుని ప్రతిష్టా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతిష్టా సందర్భంగా మూడు రోజులుగా యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నర్సింహరాజు, కవిత దంపతులతో పాటు మాజీ ఎంపీటీసీ వంకధారి శ్రీనుబాబు దంపతులు, బద్దుల చినవీరయ్య, బింజు వీర నాగేశ్వరరావు, ఆకి శివ వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొని హోమపూజల్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కారుచోలకు చెందిన భావన్నారాయణ పర్యవేక్షణలో వారి శిష్యబృందం వేదమంత్రోచ్చారణల నడుమ ఉదయం 10.10 శుభముహూర్తాన స్వామి వారి ప్రతిమను ప్రతిష్టించారు. 11.30 గంటలకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం భాగ్యం కలిగించారు. అనంతరం ప్రతిష్టకు హాజరైన వేలాది మంది భక్తులకు అన్నప్రసాద వినియోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ బోయపాలెం శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి గుడి ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు దంపతులు గ్రామపెద్దలు రాజశేఖర్‌ను పూర్ణకుంభంతో సాదరంగా ఆహ్వానం పలికారు. ఆయనకు దర్శనం అనంతరం పండితులచే ఆశీర్వచనాలు ఇప్పించి సత్కరించారు. అలాగే మాజీసర్పంచ్ వడ్డేపల్లి శివశంకర్, విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్, సాయిబాలాజీ మిల్ జీఎం స్వామివారిని దర్శించుకోగా వారిని సత్కరించారు.

ఇంటిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలి

బొల్లాపల్లి ఎంపీడీఓ విజయకుమార్



మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, పక్కన ఇఓపీఆర్డీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పలు అంశాలపై ఎంపీడీఓ వీఏ విజయకుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని, ప్రస్తుతం ఇప్పటికి మండలం మొత్తం 20 శాతం మాత్రమే వసూళ్లు చేశారని తెలిపారు. మార్చినెల చివరికి నూరు శాతం పన్ను వసూళ్లు రాబట్టాలని చెప్పారు. ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్, కులగణన, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాల సర్వేపై సమీక్షించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు మండలంలోని 33 పంచాయతీకు 2.54 కోట్లు మంజూరయ్యాయని, వీటి లో 1.35 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా యని వెల్లడించారు. తొలుత ఈ నిధుల్లో క్లాప్ మిత్రకు వేతనాలు, కరెంటు బిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నేడు నర్సరావుపేటలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించనున్న ఒక రోజు శిక్షణకు హాజరుకావాలని సూచించారు. సమీక్షలో ఇఓపీఆర్డీ ఎస్‌కె జిలానీ బాషా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ... నమోస్తుతే..



నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల కాలనీ జెడ్పీ హైస్కూల్ సమీపంలోని నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, ఆలయ ధర్మకర్తలు బానా దుర్గారెడ్డి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



రొంపిచర్ల: మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో సరోజిని సోమవారం పరిశీలించారు. గోగులపాడు, రామిరెడ్డిపాలెం, ఆరేపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించింది. పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశీలించి, స్థానిక అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు ఎ. శ్రీనివాసరావు, సుబ్బారావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బూత్ లెవెల్ అధికారులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి కనిపించడం లేదంటూ ఫిర్యాదు



కందిమళ్ల శేషగిరి రావు (ఫైల్)

చిలకలూరిపేటటౌన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి ఇంటికి రాలేదని రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుక్కపల్లివారిపాలెంకు చెందిన 72 ఏళ్ల కందిమళ్ల శేషగిరిరావు గత ఏడాది డిసెంబర్ 29వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆయన కోసం బంధువులు, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం భార్య కందిమళ్ల పుష్పావతి పోలీసులు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వీరాంజనేయ స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న దంపతులు

నాదెండ్ల: గణపవరం-కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి పరిమి లక్ష్మీనారాయణ శాస్త్రి బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి గోత్రనామ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామచంద్ర సహిత వీరాంజనేయస్వామి, సువర్చలాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వారికి గణపతిపూజ, శిఖర కలశాలకు పంచామృతాభిషేకాలు, ఏకరుద్రాభిషేకం నిర్వహించనున్నారు. స్వామివార్లకు నూతన వస్త్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్వామివారికి ఆకుపూజ, వివిధ రకాల పూజలతో విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు, కమిటీ సభ్యులు శివరామకృష్ణ, ఎ.సత్యనారాయణగుప్త, అనిసెట్టి సుబ్బారావు, కృష్ణారావు, నాగేశ్వరాచారి, మస్తాన్‌బాబు, మున్నంగి శేషయ్య, శ్రీపతి, నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు, కెల్లంపల్లి వెంకయ్య పర్యవేక్షించారు.

ఇక నుంచి సొసైటీలో ఆన్‌లైన్ విధానం

చైర్మన్ నాగులపాటి చెన్నయ్య

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరమితి సంఘాల్లో అవినీతి ఆక్రమాణలకు తావు లేకుండా ఉండటానికి మార్పులు తీసుకువస్తున్నట్లు శావల్యాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ నాగులపాటి చెన్నయ్య అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో సొసైటీ వ్యవస్థ ద్వారా రైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందించడానికి అన్నీ రికార్డులు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటరైజ్‌డ్ విధానం పనులు జరుగుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగినటు వంటి అవినీతి అక్రమాణలకు తావులేకుండా ప్రభుత్వం మార్పులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. శావల్యాపురం సొసైటీ బ్యాంకు పరిధిలో 5500 మంది రైతుల బ్యాంకు ఖాతాలు కల్గియుండగా అప్పులు, నిల్వలు, డిపాజిట్స్ బ్యాంకు పరమైన అంశాలన్నీ ఇతర బ్యాంకుశాఖల మాదిరిగా ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలను పొందుపరుస్తున్నట్లు చెప్పారు. సొసైటీ బ్యాంకు అధికారులకు సిబ్బందికి హెచ్‌ఆర్ అమలు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు సీఈవో జాలాది నాగప్రసాదు, సిబ్బంది నూకతోటి సతీష్, కె.రామాంజినేయులు ఉన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేద్దాం



నాదెండ్లలో మాట్లాడుతున్న డాక్టర్ సాయిశ్వేత

నాదెండ్ల: మార్చి 3న జరిగే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేద్దామని నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిశ్వేత చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆశాలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిశ్వేత మాట్లాడుతూ, నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలో నాదెండ్ల, తూబాడు, చందవరం, చిరుమామిళ్ళ, సంకురాత్రిపాడు, సాతులూరు గ్రామాల్లో 18 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 0-5 ఏళ్ళలోపు 3402 మంది చిన్నారులు ఉన్నారని, నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో గణపవరం, మానుకొండవారిపాలెం, పసుమర్రు గ్రామాల్లోని 11 సెంటర్లలో పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ కవితా అనసూయ, డాక్టర్ ప్రసాద్ నాయక్ తెలిపారు. 1700 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో ఒక మొబైల్ వాహనం ద్వారా చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో షబ్ యే బరాత్ ప్రార్థనలు



అమీమియా మసీదులో షబ్ యే బరాత్ పవిత్రను వివరిస్తున్న హాఫీజ్‌సాబ్ మొహమ్మద్ అహరార్

యడ్లపాడు: పవిత్ర రంజాన్ మాసం రానుందని గుర్తు చేస్తూ మహిమాన్విత రాత్రిగా పేర్కొనే షబ్ యే బరాత్ పర్వదినాన్ని ఆదివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని దాదాపు అన్ని మసీదులో రాత్రి ఇషా నమాజ్ తర్వాత గురువులు షబ్ యే బరాత్ పవిత్రత, రానున్న రమజాన్ మాసం విశిష్టతలను తెలియజేశారు. ప్రతి ఒక్కరు మహాప్రవక్త మార్గాన్ని అనుసరించాలని, రాబోయే రంజాన్ మాసంలో ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకుని పుణ్యఫలాలను పొందాలని సూచించారు. పవిత్ర రాత్రి సందర్భంగా మసీదుల్లో తెల్లవారుజాము వరకు భక్తులు నమాజు.. జికర్.. పవిత్ర ఖురాన్ పఠనంతో గడిపారు. మహిళలు తమ తమ గృహాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ దరియావలి



మాట్లాడుతున్న దరియావలి

చిలకలూరిపేట: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ దరియావలి చెప్పారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ దరియావలికి పట్టణంలోని కేబీ రోడ్డులోని అమీనియా మసీదు వద్ద మైనార్టీ నాయకులు అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల కోసం రూ. 24 వేల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. గతంలో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన కారణంగా నేడు ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. ఆయన తనయుడు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే ముస్లింలకు ఎంతో మేలు చేస్తున్నారని, ఆయన విజయానికి ముస్లింలు కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా దరియావలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ యూసూఫ్‌అలి, షేక్ కరిముల్లా, షేక్ మీరాబి, వైఎస్సార్ సీపీ నాయకులు భాష, ముజాఫా, మస్తాన్‌వలి, అబ్బాస్‌ఖాన్, మౌలాలి, మొహిద్దీన్, షరీఫ్ పాల్గొన్నారు.

కొండవీడు అభివృద్ధిలో మరోమైలురాయి

- పర్యాటకానికి ఇకపై ఆధ్యాత్మిక రూపు
- 29న కొండపై లక్ష్మీనరసింహా స్వామి ఆలయ ప్రతిష్ట
- నేడు రెండు గ్రామాల్లో శోభాయాత్ర



ప్రతిష్టా మహోత్సవానికి సిద్ధం చేసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యడ్లపాడు: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన చారిత్రక కొండవీడు పర్యాటకంగానే కాకుండా ఆధ్యాత్మిక పరంగానూ ఖ్యాతిని తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నియోజకవర్గ ఎమ్మెల్యే విడదల రజిని చొరవ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో 2019 నుంచి రూ.15 కోట్లతో దశలవారీగా కొండవీడు పర్యాటకంగా సందర్శకులకు అనేక వసతుల్ని కల్పించడంతో పర్యాటక కేంద్రంగా గొప్ప ప్రగతి సాధించింది.

ఇకపై ఆధ్యాత్మికంగానూ...

కొండపై రెడ్డిరాజులు నిర్మించిన పురాతన శ్రీలక్ష్మినరసింహస్వామి ఆలయం పునఃనిర్మాణ పూర్తిగావించి ఈనెల 29వ తేదీన ఆలయం ప్రతిష్టా మహోత్సవాన్ని ఆశాఖా అధికారులు సుమూహూర్తాన్ని నిర్ణయించారు. ప్రతిష్ట సందర్భంగా మంగళవారం కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లో స్వామి వారి విగ్రహాలను శోభాయాత్ర అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చెన్నుపాటి శివయ్య తెలిపారు. 28వ తేదీన యజ్ఞయాగ పూజాదిక్రతువులు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన యాగశాల పనుల్ని పూర్తి చేశామని మూడు రోజుల హోమ పూజల్లో కొండవీడు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, నాగమల్లేశ్వరీ దంపతులు కూర్చొనున్నట్లు ఆయన వెల్లడించారు. 29న ఉదయం 9.58 గంటలకు దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో పండితులు రత్నాకరం భార్గవాచార్యులు, పరుచూరి నితిన్ కుమార్‌చార్యుల ఆధ్వర్యాన యంత్రస్థాపన, నరసింహాస్వామి, గరుడా ఆళ్వార్ వార్ల విగ్రహాలు, 35 అడుగుల ధ్వజస్తంభం ప్రతిష్టా మహోత్సవం, పూర్ణాహుతి, ధృవ దేవతా కల్యాణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొండపై శిథిలావస్థకు చేరిన దీనిని దేవదాయశాఖ ఆధ్వర్యంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో దేవాదయశాఖ నిధులు రూ.45.60 ఆలయ పునఃనిర్మాణం చేయగా నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి విడదల రజిని చొరవతో 2020న కామన్‌గుడ్ ఫండ్ రూ.30 లక్షల నిధులతో దేవాదాయశాఖచే ఆలయ నిర్మాణ పనుల్లో రెండు భాగాల్ని పూర్తి గావించి ప్రతిష్టా కార్యక్రమానికి సిద్ధం చేశారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు హాజరుకానున్నారు.

ఈపూరులో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభించిన మేనేజర్లు రమేష్, రాజేష్

ఈపూరు: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆర్థిక సహకారంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో మండల కేంద్రమైన ఈపూరులో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమేష్, చైతన్య గోదావరి బ్యాంక్ మేనేజర్ రాజేష్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ప్రతి మూడు మండలాలకు ఒకటి చొప్పున నడుపుతుందని తెలిపారు. ఈపూరు, బొల్లాపల్లి, నకరికల్లు మండలాల్లో అవార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు, గొలుసు కట్టు కంపెనీలు, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోవద్దని, మన డబ్బులు మనం జాగ్రత్తగా దాచుకోవాలన్నారు. ఈ కేంద్రం సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగదు రహిత లావాదేవీలను అందరూ అలవర్చుకోవాలని తెలిపారు. డీఆర్‌డీఏ సీసీలు రామారావు, హనుమంతరావు, రాజు, సుబ్బారావు, అవార్డు సంస్థ కార్యకర్తలు, బ్యాంక్‌ల సిబ్బంది, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

పరీక్షలకు 714 మంది నాదెండ్ల విద్యార్థులు

నాదెండ్ల: మార్చి నెల 18 నుంచి 29వ తేదీ వరకూ జరగనున్న పదో తరగతి పరీక్షలకు మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. మొత్తం 14 పాఠశాలల నుంచి 714 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో 345 మంది బాలికలు, 369 మంది బాలురు ఉన్నారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు కాగా, సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాతులూరు, ఎండుగుంపాలెం, కనపర్రు విద్యార్థులు 196 పరీక్ష రాయనున్నారు.

చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో చిరుమామిళ్ల, తూబాడు, సంకురాత్రిపాడు గ్రామాలకు చెందిన 194 మంది విద్యార్థులు, నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 109 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 178 మంది విద్యార్థులు చిలకలూరిపేటలోని పరీక్షా కేంద్రాలకు హాజరుకానున్నారు. 37 మంది అమీన్‌సాహెబ్‌పాలెం విద్యార్థులు నరసరావుపేట రూరల్ మండలం, యల్లమంద ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి హాజరుకానున్నారు.